సాక్షి విశాఖపట్నం

శనివారం । 19 । ఆగస్టు । 2023

న్యూస్‌రీల్

అప్పన్న సన్నిధిలో జస్టిస్ నాగార్జునరెడ్డి



కప్ప స్తంభానికి మొక్కుకుంటున్న జస్టిస్ సి.వి.నాగార్జునరెడ్డి

సింహాచలం: వరాహ లక్ష్మీ నృసింహస్వామిని శుక్రవారం రాష్ట్ర ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ జస్టిస్ సి.వి.నాగార్జునరెడ్డి దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆయనకు అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆలయంలోని కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి అష్టోత్తరం పూజ నిర్వహించారు. గోదాదేవి సన్నిధిలో కుంకుమార్చన అనంతరం వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదం, శేష వస్త్రాన్ని అధికారులు అందించారు. పీఆర్వో అప్పలనాయుడు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మార్గదర్శిలో రెండో రోజూ సీఐడీ సోదాలు



పీఎంపాలెంలోని మార్గదర్శి బ్రాంచ్

దొండపర్తి/సీతంపేట/మధురవాడ: నగరంలోని సీతంపేట, పీఎంపాలెం తదితర మార్గదర్శి చిట్‌ఫండ్ కార్యాలయాల్లో సీఐడీ అధికారులు రెండో రోజు శుక్రవారం కూడా సోదాలు నిర్వహించారు. చిట్స్ నిర్వహణలో లోటుపాట్లు ఉన్నట్లు గుర్తించడంతో మరింత లోతుగా తనిఖీలు చేపట్టినట్లు తెలుస్తోంది. సీఐడీ అధికారులతో పాటు రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్, విజిలెన్స్ అధికారులు కూడా రికార్డులు, చిట్‌దారుల వివరాలు, బ్యాలెన్స్ షీట్లు, ఇతర డాక్యుమెంట్లను పరిశీలించారు. వీటికి సంబంధించిన విషయాలపై కార్యాలయాల ఉద్యోగులను, చెల్లింపుదారులను ప్రశ్నించినట్లు సమాచారం. పీఎంపాలెంలోని బ్రాంచ్‌లో డీఎస్పీ నాగేశ్వరి ఆధ్వర్యంలో తనిఖీలు జరిగాయి.


సెప్టెంబర్ 3 నుంచి కార్పొరేటర్ల స్టడీ టూర్

డాబాగార్డెన్స్: జీవీఎంసీ కార్పొరేటర్లు స్టడీ టూర్‌కి వెళ్లనున్నారు. అమృత్‌సర్, శ్రీనగర్ మున్సిపల్ కార్పొరేషన్లలో వచ్చే నెల 3 నుంచి 10వ తేదీ వరకు పర్యటిస్తారు. అక్కడ జరుగుతున్న అభివృద్ధి, స్వచ్ఛభారత్ కార్యక్రమాలు, తాగునీరు, మురుగునీటి వ్యవస్థల నిర్వహణపై అధ్యయనం చేస్తారు. కార్పొరేషన్ ప్రజా ప్రతినిధులు, అధికారులతో పలు అంశాలు చర్చిస్తారు.

నేడు వినియోగదారుల అవగాహన సదస్సు

మహారాణిపేట: వినియోగదారుల మండలి-2 ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు మండలి న్యాయమూర్తి గేదెల వెంకటేశ్వరి తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలోని స్పందన సమావేశ మందిరంలో ఉదయం 9 గంటల నుంచి ఈ సదస్సు జరుగుతుందన్నారు. విశాఖ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి వి.శ్రీదేవి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు. సీనియర్ న్యాయవాదులు, వినియోగదారుల హక్కుల పరిరక్షణ సంస్థల ప్రతినిధులు, సేవా సంస్థల కార్యకర్తల పాల్గొంటారని వెల్లడించారు. ఈ సదస్సును వినియోగదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని న్యాయమూర్తి కోరారు.


ఐలా నూతన కమిషనర్‌గా జయచంద్ర



జయచంద్రను అభినందిస్తున్న ఇన్‌చార్జి చైర్మన్ ఈశ్వరరావు, ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్ ఐలా కమిషనర్‌గా కె.జయచంద్ర శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. మంగళగిరిలోని ఏపీఐఐసీ ప్రధాన కార్యాలయంలో డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన.. ఆటోనగర్ ఐలా డిప్యూటీ జోనల్ మేనేజర్, కమిషనర్‌గా పదోన్నతిపై వచ్చారు. ఇక్కడ కమిషనర్‌గా విధులు నిర్వర్తించిన కె.సూర్యానారాయణ ఏపీఐఐసీ ప్రధాన కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. కె.జయచంద్ర 2019–2020లో ఆటోనగర్ ఐలా కమిషనర్‌గా పనిచేశారు. ఆయన్ని ఐలా ఇన్‌చార్జి చైర్మన్ కొల్లి ఈశ్వరరావు, కోశాధికారి పద్మావతి, మాజీ ప్రతినిధి పి.నారాయణరావు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

టార్గెట్ గ్రీన్ పోర్టు



ఈస్ట్‌కోస్ట్ గేట్ వే ఆఫ్ ఇండియాగా నౌకాయానంలో అంతర్జాతీయంగా ఎదుగుతున్న విశాఖపట్నం పోర్టు ట్రస్ట్ రూటు మార్చింది. సరకు రవాణాలో ఏటికేడూ వృద్ధి నమోదు చేసుకుంటున్న పోర్టు.. దేశంలోని మేజర్ పోర్టులతో పోటీ పడుతోంది. ఇందులో భాగంగానే పర్యావరణహిత పోర్టుగా అవతరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. యురోపియన్ పోర్టుల తరహాలో సమూల మార్పులకు అధికారులు శ్రీకారం చుట్టారు. కర్బన ఉద్గారాలను సున్నాకు తగ్గించడమే లక్ష్యంగా.. మార్పులు చేపడుతున్నారు.

– సాక్షి, విశాఖపట్నం



హంబర్గ్‌పోర్టులో వినియోగిస్తున్న గ్రీన్ టగ్స్

- రెండేళ్లలో పూర్తికి విశాఖ పోర్టు అథారిటీ సన్నాహాలు
- 15 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టుతో కార్యకలాపాలు
- గ్రీన్ టగ్స్‌తో కార్గో షిప్స్ నిర్వహణ
- డీజిల్, పెట్రోల్ వాహనాల స్థానంలో సీఎన్‌జీ వెహికల్స్
- కర్బన ఉద్గారాలను సున్నాకు తగ్గించడమే లక్ష్యం

వచ్చే రెండేళ్లలో నిర్వహణ సామర్థ్యాన్ని పెంపొందించడంతో పాటు పర్యావరణహితంగా పోర్టును ఆధునీకీకరించే దిశగా విశాఖపట్నం పోర్టు అథారిటీ అడుగులు వేస్తోంది. సామర్థ్యాన్ని మరింత పెంచుకునేలా మౌలిక వసతుల కల్పనతో పాటు జెట్టీల విస్తరణ, కంటైనర్ టెర్మినల్ విస్తరణ, రవాణా, అనుసంధాన ప్రాజెక్టులపై ప్రధాన దృష్టిసారించింది. ఫ్రీ ట్రేడ్ వేర్ హౌసింగ్ జోన్ ఏర్పాటు చేస్తోంది. ఇవన్నీ ఒకెత్తయితే.. గ్రీన్ పోర్టుకు అవసరమైన రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసుకున్నారు. యురోపియన్ పోర్టుల మాదిరిగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద పోర్టుగా పేరొందిన రోటర్‌డ్యామ్‌తో పాటు ఆంట్‌వెర్ప్, హంబర్గ్, ఆమ్‌స్టర్‌డ్యామ్ పోర్టుల్లో అమలు చేస్తున్న విధానాలను మోడల్‌గా తీసుకుంటున్నారు.

రెండేళ్ల ప్రణాళికలు సిద్ధం

గ్రీన్ పోర్టుగా ఆధునీకీకరించేందుకు పోర్టు చైర్మన్ డా.అంగముత్తు రెండేళ్ల కాలపరిమితిని నిర్దేశించుకున్నారు. ఇందుకనుగుణంగా ఉన్నతాధికారులు నివేదికలు సిద్ధం చేశారు. కర్బన ఉద్గారాల నియంత్రణకు అవసరమైన చర్యలను అమలు చేయాల్సిన విధానాలపై పలుమార్లు సమీక్షలు నిర్వహించారు. ఇందులో ముఖ్యాంశాలివీ..

- పోర్టులో చేపడుతున్న కార్యకలాపాలకు పూర్తిస్థాయిలో సోలార్ విద్యుత్‌ను వినియోగించాలని నిర్ణయించారు. ఇందుకోసం 15 మెగావాట్ల సోలార్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటు చేయనున్నారు. ఇందులో ఉత్పత్తి చేసే విద్యుత్‌తోనే పోర్టు ప్రధాన కార్యాలయ అవసరాలతో పాటు సరకు హ్యాండ్లింగ్ అవసరాలకు వినియోగించనున్నారు.
- కార్గో షిప్స్ నిర్వహణకు ప్రస్తుతం బంకర్ ఆయిల్స్‌తో నడిచే టగ్స్‌ను వినియోగిస్తున్నారు. వాటి స్థానంలో గ్రీన్ టగ్స్ ఏర్పాటు చేయనున్నారు. పెద్ద కార్గో షిప్‌లను లాగడానికి, నెట్టడానికి, వాటిని ఓడరేవు లోపలికి, వెలుపలికి నడిపించేందుకు ఉపయోగించే ఈ టగ్ బోట్స్‌ను సౌర విద్యుత్ లేదా సీఎన్‌జీతో నడిపించేలా చర్యలు చేపట్టనున్నారు. పోర్టు భద్రత, అత్యవసర అవసరాలకు వినియోగించే స్టాండ్‌బై షిప్స్‌లోనూ ఇదే విధానాన్ని అనుసరించాలని భావిస్తున్నారు.
- పోర్టులో వినియోగిస్తున్న డీజిల్, పెట్రోల్ వాహనాల స్థానంలో సీఎన్‌జీతో నడిచేవి, ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగించాలని నిర్ణయించారు. ఉన్నతాధికారులు, ఇతర సిబ్బంది వాడే వెహికల్స్ నుంచి వచ్చే కాలుష్యాన్ని పూర్తిగా నివారించేందుకు ప్రత్యామ్నాయ వాహనాలపై దృష్టి సారిస్తున్నారు.
- రెండేళ్ల కాల వ్యవధిలో పోర్టులో కర్బన ఉద్గారాల నియంత్రణ సున్నాకు చేరుకున్న తర్వాత గ్రీన్ పోర్టుగా ధ్రువీకరించేందుకు దరఖాస్తు చేసుకోవాలని పోర్టు చైర్మన్ భావిస్తున్నారు. వీలైనంత త్వరగా గ్రీన్‌పోర్టు మార్గదర్శకాలను అవలంబించేందుకు ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకోవాలని ఇప్పటికే అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

రూ.కోటితో 'విక్టోరియా'లో సోలార్ వెలుగులు

- ముందుకొచ్చిన ఏఎంఎన్‌ఎస్‌ఎల్ కంపెనీ
- తొలి విడతగా రూ.30 లక్షల అందజేత



కలెక్టర్ మల్లికార్జునకు రూ.30 లక్షల చెక్కు అందజేస్తున్న ఏఎంఎన్‌ఎస్‌ఎల్ ప్రతినిధులు

మహారాణిపేట: ఉత్తరాంధ్ర జిల్లాల్లోని ఏకైక ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి అయిన ఘోషాస్పత్రి(విక్టోరియా)లో సోలార్ విద్యుత్ ప్రాజెక్ట్ ఏర్పాటుకు ఆర్సెలర్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా లిమిటెడ్(ఏఎంఎన్‌ఎస్‌ఎల్) ముందుకొచ్చింది. ఆస్పత్రిలో మొత్తం సోలార్ వెలుగులకు అవసరమైన రూ.కోటి భరించేందుకు సమ్మతిని తెలియజేసింది. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ మల్లికార్జునను ఏఎంఎస్ఎస్‌ఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.రవీంద్రనాథ్, కంపెనీ హెచ్‌ఆర్ హెడ్ డి.ఎస్.వర్మ కలిసి సమ్మతి పత్రాన్ని అందజేశారు. సీఎస్సార్‌లో భాగంగా తొలి విడతగా రూ.30 లక్షల చెక్కును కలెక్టర్‌కు అందజేశారు. ఈ కంపెనీ ఇప్పటికే కేజీహెచ్‌లో సోలార్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటు చేయడానికి రూ.50 లక్షలు అందజేసింది. సీఎస్సార్ బ్లాక్ రూఫ్‌టాప్‌పై ప్రస్తుతం సోలార్ పలకలను అమర్చుతున్నారు. వచ్చే నెల 30వ తేదీ నాటికి ఈ ప్రాజెక్ట్ పనులు పూర్తవుతాయి.

పంచగ్రామాల సమస్య పరిష్కారానికి మార్గం సుగమం!

- గాజువాక రెవెన్యూ పరిధిలో రూ.1900 కోట్ల విలువైన భూమి దేవస్థానానికి ఇచ్చేందుకు సిద్ధం
- పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ వెల్లడి



93వ వార్డులో శంకర్ ఫౌండేషన్ ఐ ఆస్పత్రి వద్ద శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: పంచ గ్రామాల భూ సమస్య పరిష్కారానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చారిత్రక నిర్ణయం తీసుకున్నారని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలిపారు. నియోజకవర్గ పరిధిలో రూ.1.71 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వం 2019 ఎన్నికల ముందు భూసమస్య పరిష్కారం చేస్తామంటూ ఆగమేఘాల మీద జీవో తీసుకొచ్చిందన్నారు. సింహాచలం దేవస్థానానికి ప్రత్యామ్నాయంగా అనకాపల్లి ప్రాంతంలో 400 ఎకరాలు ఇచ్చే యోచన చేసిందన్నారు. కానీ అక్కడి భూములకు, దేవస్థానం భూముల మధ్య రూ.2,500 కోట్ల విలువ తేడా వస్తోందన్నారు. దీంతో కోర్టు అంగీకరించలేదన్నారు. ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏ ప్రభుత్వం తీసుకోని నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. గాజువాక రెవెన్యూలో రూ.1900 కోట్లు విలువ చేసే 250 ఎకరాల భూమిని దేవస్థానానికి ప్రత్యామ్నాయంగా ఇచ్చేందుకు నిర్ణయించారన్నారు. భూ సమస్యపై ఏర్పాటు చేసిన కమిటీ దీనిపై తీర్మానం చేసి కోర్టుకు సమర్పించినట్లు చెప్పారు. త్వరలోనే ఈ సమస్య పరిష్కారం అవుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అప్పన్న ధ్వజస్తంభం.. ఇక స్వర్ణమయం

పనులు ప్రారంభించిన చెన్నై సంస్థ



ధ్వజస్తంభం

సింహాచలం: వరాహ లక్ష్మీ నృసింహస్వామి ఆలయ ధ్వజస్తంభం ఇక మీదట స్వర్ణకాంతులతో భక్తులకు దర్శనమీయనుంది. ధ్వజస్తంభానికి రూ.1.80 కోట్లతో సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ పసిడి కాంతులు చేకూరుస్తున్నారు. శుక్రవారం ధ్వజస్తంభంలో ఉన్న మూర్తిని కలశలోకి ఆవాహనం చేసే కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం చెన్నైకి చెందిన స్మార్ట్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో ధ్వజస్తంభం రాగి తాపడం తొలగింపు పనులు ప్రారంభించారు. శ్రావణమాసం ముగిసేలోపే స్వర్ణమయం పనులు పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నారు. అప్పటి వరకు ధ్వజస్తంభం వద్ద జరిగే పూజలు.. మూర్తి ఆవాహనం జరిగిన కలశకే జరుగుతాయని ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ తెలిపారు. పనులు పూర్తి కాగానే కలశలోని మూర్తిని ధ్వజస్తంభంలోకి ఆవాహన చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు, కుమారాచార్యులు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, సంపంగి శ్రీనివాసరావు, వారణాసి దినేష్‌రాజ్, పిల్లా కృష్ణమూర్తిపాత్రుడు, దొడ్డి రమణ, పెనుమత్స శ్రీదేవి వర్మ, దశమంతుల రామలక్ష్మి, దేవదాయశాఖ డీసీ సుజాత, దేవస్థానం ఈఈ రాంబాబు, ఏఈవో భ్రమరాంబ తదితరులు పాల్గొన్నారు.

పక్షులతో విమాన రాకపోకలకు ఆటంకం

- ఎయిర్‌పోర్ట్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి
- కలెక్టర్ మల్లికార్జున ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

దొండపర్తి: విశాఖ విమానాశ్రయ పరిసరాలు, పర్యావరణం పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జీవీఎంసీ కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మతో కలిసి శుక్రవారం సివిల్ అడ్మినిస్ట్రేషన్, ఇండియన్ నేవీ, పోర్ట్ ట్రస్ట్, జీవీఎంసీ, ఎయిర్ పోర్ట్ అథారిటీ ప్రతినిధులతో ఎయిర్‌ఫీల్డ్ ఎన్విరాన్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. రన్‌వేలో నీటి నిల్వ, పరిసరాల్లో చెత్త డంపింగ్, పక్షుల కారణంగా ప్రమాదాలు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా పక్షుల కారణంగా విమానాల ప్రమాదాల సంఖ్య పెరిగిందన్నారు. 2021లో 1,430 కాగా ఇపుడు ఆ సంఖ్య 2174కు పెరిగి ఆందోళన స్థాయికి చేరిందని వెల్లడించారు. విశాఖ విమానాశ్రయ ప్రాంతం పూర్తిగా జనసాంద్రత కలిగిన ప్రాంతాలతో ఉన్నందున అధిక వ్యర్థాలు చేరుతున్నాయని తెలిపారు. మేహాద్రి గెడ్డ కాలువలో కోళ్లు, మేకల మాంసపు వ్యర్థాలు వేస్తున్నారని, ఈ ప్రాంతాలు పక్షులు, కుక్కలు, పందులకు ఆవాసాలుగా మారుతున్నాయని చెప్పారు. దీని కారణంగా పక్షుల సంతతి పెరిగి విమాన రాక, పోకలకు తరచుగా ఆటంకం కలిగిస్తున్నాయన్నారు. విమానాశ్రయం చుట్టుపక్కల ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని, మాంసపు దుకాణాలను తొలగించాలని, పారిశుధ్య పనులు చేపట్టాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. ఈ విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. క్లాప్ వాహనాల ద్వారా ఎప్పటికప్పుడు వ్యర్థాలను తరలించాలన్నారు. భారీ వర్షాలకు మేహాద్రిగెడ్డ, కొండగెడ్డల నీరు విమానాశ్రయంలోకి రాకుండా తగిన నిర్మాణాలు, పూడికతీత పనులు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఎయిర్‌పోర్ట్ ప్రాంగణంలో నీటి నిల్వకు గల కారణాలను ఇరిగేషన్ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అంతర్గతంగా ఉన్న మూడు కాలువలను సక్రమంగా నిర్వహణ చేపట్టాలని ఎయిర్ పోర్ట్ అథారిటీకి సూచించారు. కొండగెడ్డ పూడిక తీతకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఐఎన్ఎస్ డేగ కెప్టెన్ రాజ్‌కుమార్ పొదర్ మాట్లాడుతూ ఆర్.కె. బీచ్ ప్రాంతంలో విమానాల రాక సమయంలో లేజర్ లైట్స్ కారణంగా ఇబ్బందులు కలుగుతున్నాయని, వీటిని అదుపు చేయాలని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. పక్షుల వల్ల విమానాలకు ప్రమాదం పొంచి ఉందని, ఎయిర్ పోర్ట్ పరిసరాలు చుట్టూ వ్యర్థాలు చేరకుండా సంబంధిత శాఖల ద్వారా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో విమానాశ్రయ డైరెక్టర్ ఎస్.రాజారెడ్డి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

శ్రావణం..శోభాయమానం



కనకమహాలక్ష్మి అమ్మవారికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, భక్తులు



సింహవల్లీ తాయారు సన్నిధిలో లక్ష కుంకుమార్చన నిర్వహిస్తున్న అర్చకులు

- కనకమహాలక్ష్మి సన్నిధిలో శ్రావణలక్ష్మి పూజలు
- వాసవీ మాత సన్నిధిలో 108 గోత్ర రుషి పూజలు
- సింహవల్లీ తాయారుకు లక్ష కుంకుమార్చన

డాబాగార్డెన్స్: శ్రావణమాసం తొలి శుక్రవారం అమ్మవారి ఆలయాలన్నీ భక్తులతో కళకళలాడాయి. కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం 8గంటల కు నిర్వహించిన శ్రావణలక్ష్మి పూజల్లో 176 మంది భక్తులు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. వేద ఆశీర్వచనం అనంతరం అమ్మవారి ప్రసాదం అందించా రు. ఈవో కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో..

కురుపాం మార్కెట్ సమీపంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని పట్టు వస్త్రాలతో అలంకరించారు. వేకువజామున మూలవిరాట్‌ను 108 ద్రవ్యాలతో, పండ్ల రసాలతో అభిషేకించారు. పట్టు వస్త్రాలతో అలంకరించిన అనంతరం 108 స్వర్ణ పుష్పాలతో పూజలు చేశారు. ఆలయం మండపంలో నిర్వహించిన సామూహిక 108 గోత్ర రుషిపూజల్లో 250మంది మహిళలు పాల్గొన్నారు. దేవాలయ సంఘం అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్, గ్రంధి రామకృష్ణారావు, దేవస్థాన పురోహితుడు ఆర్‌బీబీ కుమారశర్మ తదితరులు పాల్గొన్నారు.

సింహగిరిపై ప్రత్యేక పూజలు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో కొలువుదీరిన సింహవల్లీ తాయారు అమ్మవారికి లక్ష కుంకుమార్చన పూజ చేశారు. ఉదయం 7 గంటల నుంచి 9గంటల వరకు అర్చకులు ఈ పూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సువర్ణ అమ్మవారు, చతుర్భుజ తాయారు అమ్మవార్ల ఉత్సవమూర్తులను సింహవల్లీ తాయారు ప్రాంగణంలో సింహాసనంపై కొలువుదీర్చి లక్ష నామాలను పఠిస్తూ, పది ఆవృతులతో కుంకుమ పూజ చేశారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకరి కరి సీతారామాచార్యులు, అర్చకులు గిరి, శ్రీకాంత్, అధ్యాపకులు ఈ కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం సింహవల్లీ తాయారు సన్నిధిలో సహస్ర నామార్చన చేశారు. అనంతరం సువర్ణ అమ్మవారు, చతుర్భుజ తాయారు ఉత్సవమూర్తులను పల్లకిలో కొలువుదీర్చి, మాడ వీధిలో తిరువీధి ఉత్సవం నిర్వహించారు.



కన్యకాపరమేశ్వరి ఆలయంలో గోత్ర రుషిపూజలో పాల్గొన్న మహిళలు (ఇన్‌సెట్) కన్యకాపరమేశ్వరి

20న 'ఇతిహాస్ కే పన్నోంసే' ప్రదర్శన

డాబాగార్డెన్స్: ఇతిహాస్ కే పన్నోంసే (చరిత్ర పుటల్లోంచి) శీర్షికన భారత స్వాతంత్ర సంగ్రామంలో వీరోచితంగా పోరాడి అసువులు బాసిన యోధాను యోధులను కళ్లకు కట్టినట్టు చూపించే కార్యక్రమాన్ని ఈ నెల 20న విశాఖలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమ పోస్టర్‌ను డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం ఆవిష్కరించారు. ముంబయి, చెన్నై, హైదరాబాద్, విశాఖపట్నం, కాకినాడ తదితర ప్రాంతాలకు చెందిన కళాకారులు ప్రదర్శన ఇవ్వనున్నారు. సిరిపురం కూడలిలోని స్వీట్ ఇండియా, లాసన్స్‌బే కాలనీలో బుకింగ్ మ్యాజిక్‌లో టికెట్లు అందుబాటులో ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు నిర్వాహకులు 91674 00670 నంబరులో సంప్రదించవచ్చు.

'ఇంటింటి ఓటరు సర్వే శత శాతం పూర్తి చేయాలి'

మహారాణిపేట: ఇంటింటి ఓటరు సర్వే శత శాతం పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా అన్నారు. శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టర్లతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. సర్వే పూర్తి చేసి, అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున మాట్లాడుతూ విశాఖ జిల్లాలో ఇప్పటి వరకు 7,01,879 ఇళ్లకు గాను 82.46 శాతం సర్వే పూర్తి చేశామన్నారు. 13,22,927 ఓటర్ల సర్వే చేశామని చెప్పారు. రానున్న మూడు రోజుల్లో శతశాతం పూర్తి చేస్తామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తి, రెవెన్యూ డివిజనల్ అధికారులు హుస్సేన్ సాహెబ్, భాస్కరరెడ్డి, వీఎంఆర్‌డీఏ ఎస్టేట్ అధికారి లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు

- జిల్లా జేసీ విశ్వనాథన్
- ఉద్యోగుల గ్రీవెన్స్‌కు 28 వినతులు

మహారాణిపేట: ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జేసీ కె.ఎస్.విశ్వనాథన్ తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఉద్యోగుల సమస్యలపై గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. ఈ ఫిర్యాదులను సంబంధిత శాఖలకు పంపించి పరిష్కారం కోసం కృషి చేస్తామని జేసీ తెలిపారు. మొత్తం 28 వినతులు అందాయి. హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్‌కు 5, పంచాయతీరాజ్‌కు 2, స్కూల్ ఎడ్యుకేషన్‌కు 3, రెవెన్యూకు 8, పోలీసు విభాగానికి ఒకటి, ట్రాన్స్‌పోర్టుకు 5, ఫారెస్ట్ విభాగానికి ఒకటి, ఫైనాన్స్ విభాగానికి ఒకటి, కేజీహెచ్‌కు రెండు వినతులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ ఉద్యోగుల గ్రీవెన్స్‌కు 10 అర్జీలు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ఉద్యోగులకు సంబంధించి శుక్రవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు 10 వినతులు అందాయి. జీవీఎంసీ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, ఎస్.ఎస్.వర్మ, డాక్టర్ వి.సన్యాసిరావు ఉద్యోగుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగుల సౌకర్యార్థం ప్రతి నెలా 3వ శుక్రవారం ఉద్యోగుల గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అర్జీలను పరిశీలించి కమిషనర్ నిర్ణయం మేరకు పరిష్కరించేందుకు తగు నిర్ణయం తీసుకోవడంతో పాటు ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. ప్రధాన ఇంజినీరు రవికృష్ణరాజు, డీసీ(రెవెన్యూ) ఫణిరాం, డీడీ(హార్టికల్చర్) దామోదరరావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

కవాతుతో శారీరక, మానసిక దృఢత్వం

దొండపర్తి: పోలీస్ సిబ్బంది శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండేందుకు కవాతు దోహదపడుతుందని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ అన్నారు. శుక్రవారం ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో ఏఆర్ పోలీస్ సిబ్బంది నిర్వహించిన కవాతును సీపీ పరిశీలించారు. అనంతరం పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ నిర్వహించారు. ఇందులో 10 మంది నగర పోలీస్ సిబ్బంది నుంచి వినతులు స్వీకరించారు. వాటిని సత్వరమే పరిష్కరించే దిశగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పోలీస్ మెస్ హోంను పునర్నిర్మాణం చేయడంతో పాటు కొత్త బెడ్లు, బెడ్ షీట్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పోలీస్ కో-ఆపరేటివ్ స్టోర్‌ను విస్తరిస్తున్నట్లు తెలిపారు. పోలీస్ కల్యాణమండపం ఆధునికీకరణతో పాటు ఏసీ సౌకర్యం కల్పిస్తామన్నారు. వచ్చే నెల నుంచి ప్రతీ మూడో శుక్రవారం సిబ్బంది సంక్షేమ దివాస్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శాఖాపరమైన అంశాలలో ఏదైనా సమస్యలు ఉంటే గ్రీవెన్స్‌లో నిరభ్యంతరంగా తెలియజేయవచ్చని సూచించారు. సిబ్బంది సంక్షేమానికి పెద్ద పీట వేస్తామని భరోసా ఇచ్చారు. ఏడీసీపీ(అడ్మిన్) ఎం.ఆర్.కె.రాజు, ఏడీసీపీ(ఎస్‌బీ) ఇ.నాగేంద్రుడు, ఏడీసీపీ(ఏఆర్) కె.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

230 మొబైల్స్.. రూ.40 లక్షలు

- చాట్ బాట్ యాప్ ద్వారా రికవరీ
- వివిధ కేసుల్లో బంగారు నగల స్వాధీనం
- ట్రాఫిక్ క్రమబద్ధీకరణకే టైకూన్ కూడలి మూసివేత
- నగర సీపీ డాక్టర్ త్రివిక్రమ్ వర్మ



రికవరీ చేసిన మొబైల్స్‌ను పరిశీలిస్తున్న సీపీ త్రివిక్రమ్ వర్మ, ఉన్నతాధికారులు

అల్లిపురం: వివిధ కేసుల్లో భారీగా బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్లు రికవరీ చేసి, బాధితులకు అందించామని నగర సీపీ డాక్టర్ త్రివిక్రమ్‌వర్మ తెలిపారు. టూటౌన్, మహారాణిపేట, ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో వచ్చిన ఫిర్యాదులకు సకాలంలో స్పందించి రికవరీ చేశామన్నారు. ఈ మేరకు నగర పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన ఆయా కేసుల వివరాలు వెల్లడించారు. పోయిన, చోరీకి గురైన రూ.40 లక్షలు విలువ చేసే 230 మొబైల్స్‌ను చాట్‌బోట్ యాప్ ద్వారా సీఐ ఆర్.సత్యనారాయణ ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకుని బాధితులకు అందజేశామని సీపీ తెలిపారు. క్రైం డీసీపీ జి.నాగన్న, ఏడీసీపీ డి.గంగాధర్, ఏసీపీ ఎ.వెంకటరావుల పర్యవేక్షణలో సాంకేతికతను ఉపయోగించి మొబైల్స్‌ను రికవరీ చేశామన్నారు.

టూటౌన్ పరిధిలో..

ఈ నెల 2వ తేదీ సాయంత్రం 5.40 గంటల సమయంలో బాసర శ్రీను అనే వ్యక్తి డయల్ 112కు ఫోన్ చేసి తమ సోదరి ఇంట్లో 10 తులాల బంగారు ఆభరణాలు కనిపించడం లేదని ఫిర్యాదు చేశారు. టూటౌన్ క్రైం పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి వారి ఇంట్లో బియ్యం డబ్బాలో నగలను గుర్తించి అందజేశారు.

- ఈ నెల 4వ తేదీ రాత్రి 9.30 గంటలకు వెంకటేశ్వరమెట్టకు చెందిన తెలుగు పద్మ 112 నంబరుకు కాల్ చేసి తన ఇంట్లో 11 తులాల బంగారు ఆభరణాలు కనిపించడం లేదని ఫిర్యాదు చేశారు. టూటౌన్ క్రైం సిబ్బంది అక్కడికి చేరుకుని విచారణ చేపట్టి ఇంట్లో అటకపై ఉన్నట్టు గుర్తించారు. ఈ కేసుల్లో ఎటువంటి అనుమానాలు వ్యక్తం చేయలేదని తెలిపారు.

మహారాణిపేట పరిధిలో..

బి.లక్ష్మీ అనే మహిళ గత నెల 24న డైమండ్ పార్క్ నుంచి కేజీహెచ్‌కు ఆటోలో ప్రయాణించింది. ఆటో దిగిన తరువాత తన రెండు తులాల నల్లపూసల దండ, అర తులం ఉంగరం పోయినట్లు గుర్తించింది. ఈ మేరకు ఆమె మహారాణిపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. క్రైం పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా ఆటోను గుర్తించి పోయిన బంగారు వస్తువులను రికవరీ చేసి బాధితురాలికి అప్పగించారు.

ఫోర్తు టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో..

యు.వంశీప్రియ ఈ నెల 2న ఉదయం 11 గంటలకు నరసింహనగర్ నుంచి సీతమ్మధార స్టేట్ బ్యాంక్ వరకు ఆటోలో ప్రయాణించింది. ఆ సమయంలో తన చేతికి ఉన్న రూ.1.50 లక్షల విలువ గల రిస్ట్ వాచ్ ఆటోలో పోగొట్టుకుంది.

ఈ మేరకు ఆమె ఫోర్త్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. సీసీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు ఆటోను గుర్తించారు. వాచీని స్వాధీనం బాధితురాలికి అందజేశారు. ఈ సందర్భంగా క్రైం టీంను సీపీ అభినందించారు.

నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు సీపీ తెలిపారు. నగరంలో పది రోజుల్లో పలు రోడ్డు ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు కోల్పోయారన్నారు. వీటికి డ్రంక్ అండ్ డ్రైవ్ కారణంగా గుర్తించామన్నారు. ఈ ఏడాది జూన్ వరకు 9,143 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశామన్నారు. రోజూ సాయంత్రం 6 నుంచి 9 గంటల సమయంలో ప్రమదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. రోడ్డు ప్రమాదాలు బైక్ రైడర్స్ వల్లే సంభవిస్తున్నాయన్నారు.

- ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసమే సిరిపురం జంక్షన్, టైకూన్ కూడలి, ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద పలు డివైడర్లు ఏర్పాటు చేశామని సీపీ స్పష్టం చేశారు. ముఖ్యంగా టైకూన్ జంక్షన్‌లో డివైడర్లు ఏర్పాటు చేయడం వల్ల 10 శాతం మందే ఇబ్బంది పడుతున్నారన్నారు. 90 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. 400 మీటర్ల దూరం వెళ్లి తిరిగి వీఐపీ రోడ్డుకు చేరుకోవడం వల్ల సమయం వృథా కాకుండా ఉందన్నారు. ఈ సమావేశంలో క్రైం డీసీపీ జి.నాగన్న, ఏడీసీపీ డి.గంగాధర్, ఏసీపీ ఎ.వెంకటరావు పాల్గొన్నారు.

పారదర్శకంగా టీచర్ల సర్దుబాటు

వైఎస్సార్ టీఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ చొక్కాకుల



డీఈవోకు వినతి పత్రం అందిస్తున్న చొక్కాకుల

విశాఖ విద్య: ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చొక్కాకుల సూర్యనారాయణ కోరారు. డీఈవో చంద్రకళను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించారు. సర్ ప్లస్ ఉపాధ్యాయులను విద్యార్థులు ఎక్కువగా ఉన్న స్కూళ్లలో కేటాయించే విషయంలో నిబంధనలు పాటించాలన్నారు. అన్ని స్కూళ్లలో ఉపాధ్యాయులు ఉండాలనేది ప్రభుత్వ ఉద్దేశమన్నారు. ఉపాధ్యాయుల సర్వీసు పరమైన సమస్యల పరిష్కారానికి సకాలంలో స్పందించాలన్నారు. ఈ మేరకు ఉపాధ్యాయుల సమస్యలపై డీఈవోకు వినతిపత్రం అందజేశారు.

గ్రూప్-1 ఫలితాల్లో వైజాగ్ ఐఏఎస్ అకాడమీ సత్తా



ర్యాంకులు సాధించిన అభ్యర్థులు

ఎంవీపీ కాలనీ: ఏపీపీఎస్సీ గ్రూప్-1 ఫలితాల్లో వైజాగ్ ఐఏఎస్ అకాడమీ సత్తా చాటింది. 18 మంది ఉత్తమ ర్యాంకులు సాధించి ప్రతిష్టాత్మక సర్వీసులకు ఎంపికయ్యారని అకాడమీ డైరెక్టర్ పి.గౌతమ్ తెలిపారు. కడలి జయకృష్ణ, చుక్కల సూర్యకుమార్‌లు(డీఎస్పీలుగా), గోపిశెట్టి మనోహర్(ఆర్టీవో), శశాంక్(ఏపీ బీసీ వెల్ఫేర్ సర్వీస్),ఆర్.ఆదిత్య(అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, సెక్రటరీ అండ్ ట్రెజరీ), గజ్జల సురేంద్ర, తిరువీధుల్ల చిరంజీవి, కె.వర్షిణిలు (అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ స్టేట్ టాక్స్), దండ శ్వేత, లక్కాల గౌతమ్, హర్ష ముంజి, దివిజ సంపత్తి, పసుపర్తి అంకలు బాబు ఎండీవోలుగా ఎంపికైనట్టు పేర్కొన్నారు. వచ్చే నెల 15వ తేదీ నుంచి గ్రూప్-1 కొత్త బ్యాచ్‌ను ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఆటోను ఢీకొన్న బైక్

ఆరిలోవ: బీచ్ రోడ్డులో మితిమీరిన వేగంతో ఓ ద్విచక్ర వాహనచోదకుడు శుక్రవారం హల్‌చల్ చేశాడు. ట్రాఫిక్ ఎస్ఐ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నగరం నుంచి బీచ్ రోడ్డులో ఆరుగురు ప్రయాణికులతో ఆటో వెళ్తుంది. సాగర్‌నగర్ దాటిన తర్వాత రాడిసన్ హోటల్, బేపార్కు మధ్యలో మలుపు వద్ద ఓ ద్విచక్ర వాహనం మితిమీరిన వేగంతో ఆటోను వెనక నుంచి బలంగా ఢీకొంది. ఆ ధాటికి ఆటో బోల్తాపడింది. అందులో ఉన్న ఆరుగురు ప్రయాణికులు గాయపడ్డారు. వీరిలో ఇద్దరు చిన్నారులు ఉన్నారు. జోడుగుళ్లపాలేనికి చెందిన నర్సింగరావు, లక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేసి, క్షతగాత్రులను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు.



గాయపడిన ప్రయాణికులు



తలకు గాయాలతో నర్సింగరావు

కనుల పండువగా యువజనోత్సవాలు

కొమ్మాది: రాష్ట్ర యువజన సర్వీస్‌ల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రుషికొండ గాయత్రి విద్యా పరిషత్‌లో జిల్లాస్థాయి యువజనోత్సవాలు ఘనంగా జరిగాయి. యువతలోని ప్రతిభను వెలికి తీసేందుకు ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒకే భవిష్యత్తు అనే నినాదంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. కళాకారులు ప్రదర్శించిన జానపద నృత్యాలు, ఆలపించిన గీతాలు అందరినీ అలరించాయి. స్టోరీ రైటింగ్, పోస్టర్ మేకింగ్, ఫొటోగ్రఫీ తదితర అంశాలపై పోటీలు నిర్వహించారు. నాన్ కాంపిటేటివ్ ఈవెంట్స్‌లో డిజిటల్ ఇండియా, లైఫ్ మిషన్, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాల్లోనూ పోటీలు జరిగాయి. కళాశాల ప్రిన్సిపాల్ ప్రగడ రాజు గణపతి, ఎస్.రజిని, బీవీఆర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



అలరించిన విద్యార్థుల నృత్యం

ఫోర్టిఫైడ్ బియ్యంలో పోషకాలు పుష్కలం

- ప్రజలు అపోహలు వీడాలి
- జాయింట్ కలెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్

మద్దిపాలెం: ఫోర్టిఫైడ్ బియ్యంలో పోషకాలు సమృద్ధిగా ఉంటాయని జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ అన్నారు. ఈ బియ్యం వాడకంపై అపోహలు వీడాలని సూచించారు. ఆర్ అండ్ బీ జంక్షన్ వద్ద గల పౌరసరఫరాల శాఖ గొడౌన్ వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన ఫోర్టిఫైడ్ బియ్యంతో నిర్వహించిన వంటల పోటీల్లో జేసీ విశ్వనాథన్, వైఎస్సార్ సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ విశ్వనాథన్ మాట్లాడుతూ మనం రోజూ తినే ఆహార పదార్థాల్లో పోషక లోపాలను సమతుల్యం చేసేలా తయారుచేసిన ఫోర్టిఫైడ్ బియ్యం ఆరోగ్యానికి మంచిదని తెలిపారు. ఆ బియ్యం వాడకం వల్ల ఐరన్, జింక్, విటమిన్ బీ12 వంటివి శరీరానికి పుష్కలంగా అందుతాయన్నారు.గర్భిణులు ఈ బియ్యాన్ని వాడడం వల్ల రక్తహీనత సమస్యలు ఉండవని, పుట్టిన బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఇందులో ప్లాస్టిక్ ఉండదన్నారు. కేకే రాజు మాట్లాడుతూ ఫోర్టిఫైడ్ బియ్యంపై దుష్ప్రచారాలు నమ్మొద్దని ప్రజలకు సూచించారు. అనంతరం పోటీల్లో విజేతలుగా నిలిచిన అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కృష్ణవేణికి మొదటి బహుమతి, మౌలాబీబీ టీమ్‌కు రెండో బహుమతి, డ్వాక్రా గ్రూప్‌కు చెందిన వరలక్ష్మికి మూడో బహుమతి అందజేశారు. కార్యక్రమంలో డీఎల్‌డీవో పూర్ణిమాదేవి, డీఎం సివిల్ సప్‌లై ఐ.రాజేశ్వరి, ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి, డిజేబుల్ వెల్ఫేర్ ఏడీ మాధవి, డీఆర్‌డీఏ పీడీ శోభారాణి, సీడీపీవో రమణ కుమారి, డీఎస్‌వో సూర్యప్రకాశ రావు, 24వ వార్డు కార్పొరేటర్ పద్మారెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, డ్వాక్రా సంఘం సభ్యులు, రేషన్ డిపోల డీలర్లు పాల్గొన్నారు.



వంటల పోటీల్లో పాల్గొన్న వారికి బహుమతులు అందజేస్తున్న జేసీ విశ్వనాథన్, కేకే రాజు

'పవన్ కల్యాణ్‌వి అవగాహన లేని వ్యాఖ్యలు'



మాట్లాడుతున్న దేవళ్ల వెంకట రమణ

గాజువాక : దువ్వాడలోని ఒక స్థలం విషయంలో జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అవగాహన లేని వ్యాఖ్యలు చేశారని ఆరోపణలకు గురైన దేవళ్ల వెంకట రమణ పేర్కొన్నారు. గాజువాకలో విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. దువ్వాడ సర్వే నంబర్ 51/18లోని 2.90 ఎకరాల స్థలాన్ని తాము కబ్జా చేసినట్టు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఆ స్థలాన్ని బొండా రామారావు అనే వ్యక్తి నుంచి 1965లో చూచుకొండ అప్పన్న, జాగారావు పోలిపిల్లి అనే వ్యక్తులు కొనుగోలు చేశారన్నారు. అందులో స్టీల్‌ప్లాంట్ కోసం 1.07 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం ఎక్విజిషన్ చేసి వారిద్దరికీ నష్టపరిహారం కూడా చెల్లించిందన్నారు. ఆ తరువాత ఆ భూమి క్రయవిక్రయాలు సంబంధిత వ్యక్తులు, వారి వారసుల ద్వారా జరిగాయన్నారు. అందులో తాను కొనుగోలు చేసిన 35 సెంట్ల స్థలం కోర్టు ద్వారా తనకు దాఖలు పడిందన్నారు. మరికొంత భూమికి తన నుంచి డబ్బులు తీసుకుని కూడా రిజిస్ట్రేషన్‌కు రాలేదని, దీనిపై తాను జిల్లా కోర్టును ఆశ్రయించగా కేసు నడుస్తోందన్నారు. మరికొంత స్థలానికి మరో ఇద్దరు వ్యక్తులు గాజువాక కోర్టులో తనపై కేసు వేశారని, ప్రస్తుతం దావా నడుస్తోందని తెలిపారు. ఈ విషయాలపై తప్పుడు సమాచారం తెలుసుకున్న పవన్ కల్యాణ్ ప్రెస్‌మీట్ పెట్టి మరీ తమపై దుష్ప్రచారం చేయడం విచారకరమన్నారు. తనను రౌడీషీటర్ అని సంబోధించారని, ఏ పోలీస్ స్టేషన్‌లోనూ తనపై కనీసం కేసు కూడా లేని విషయం ఆయన తెలుసుకోవాలన్నారు. తమ ఆస్తికి, రాజకీయ పార్టీలకు ఎటువంటి సంబంధం లేదన్నారు. 2016లో తాను కొనుగోలు చేసిన 1.20 ఎకరాల భూమిలో ప్రహరీ నిర్మించిన సమయంలో ఆయన మద్దతు తెలిపిన ప్రభుత్వమే ఉందన్నారు. ఇప్పటికైనా పవన్ కల్యాణ్ నిజాలను తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు.

ఉక్కు కార్మికుల వేతన ఒప్పందం అమలుకు వినతి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు వేతన ఒప్పందం వెంటనే అమలు చేయాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. ఈ మేరకు ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు నేతృత్వంలో స్టీల్ ఏఐటీయూసీ నాయకులు స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్‌జేసీఎస్ ఒప్పందం మేరకు విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో కొత్త వేతనాలు అమలు చేయాలన్నారు. కార్మికుల పెండింగ్ సమస్యలపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై సీఎండీసానుకూలంగా స్పందిస్తూ ఈ నెలలో బ్లాస్ట్ ఫర్నేస్-3 ప్రారంభించిన తర్వాత కంపెనీ పరిస్థితి బాగుపడే అవకాశం ఉందన్నారు. ఆ తర్వాత సమస్యల పరిష్కారానికి తన వంతు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టీల్ ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ, మసేనురావు, రామకృష్ణ, నరేష్‌కుమార్, నర్సింగరావు, చీకటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.